# అధికారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

■ మంత్రి సీతక్కకు టీఎన్‌జీవోల వినతి

ములుగు రూరల్, డిసెంబర్ 18 : జిల్లాలో పనిచేస్తున్న గెజిటెడ్ అధికారులకు ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని మంత్రి దనసరి అనసూయ సీతక్కను టీఎన్‌జీవో ఉమ్మడి జిల్లా నాయకులు కోరారు. సోమవారం వారు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గెజిటెడ్ అధికారులు అహర్నిశలు కృషి చేస్తారని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొండ వెంకయ్య, హనుమకొండ జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేశ్‌కుమార్, ములుగు జిల్లా కార్యదర్శి దామోదరస్వామి, కోశాధికారి మునుకుంట్ల సంతోష్, టీఎన్‌జీవోలు అస్నాల శ్రీనివాస్, రామచంద్రారావుతో పాటు కార్యవర్గ సభ్యులున్నారు.

**విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి**

విద్యారంగంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ములుగు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంత్రి సీతక్కకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్‌ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, కార్యదర్శి నాగరాజు, సభ్యులు దిలీప్, శ్యామ్, సమ్మయ్య, స్వామి, రమేశ్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జగన్మోహన్‌రావు

**గణిత పుస్తకం ఆవిష్కరణ**

మండలంలోని పత్తిపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మురళీధర్ రూపొందించిన గణిత పుస్తకాన్ని ములుగులో మంత్రి సీతక్క ఆవిష్కరించారు. 6 నుంచి 10వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగపడుతుందని మురళీధర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈవో పాణి ని, ఉపాధ్యాయులు రామయ్య, ప్రేమలత, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**మంత్రిని కలిసిన న్యాయవాదులు**

మంత్రి దనసరి అనసూయ సీతక్కను ములుగు కోర్టులో పనిచేస్తున్న న్యాయవాదులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో డీ సుధాకర్, డీ రాంసింగ్, బీ నవత, జీ రజిత తదితరులున్నారు.

**కళాకారుల శుభాకాంక్షలు..**

మంత్రి సీతక్కను సాంస్కృతిక సారథి కళాకారులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పదేళ్లుగా ప్రభుత్వ పథకాలను పల్లెలకు చేరవేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కళాకారులు గోల్కొండ భిక్షపతి, కుమార్, రహీముద్దీన్, శంకర్, విజయ్, తిరుపతి ఉన్నారు.




న్యాయవాదులతో మాట్లాడుతున్న జడ్జి మాధవి

## కక్షిదారులు రాజీ పడేలా చూడాలి

**సీనియర్ సివిల్ జడ్జి మాధవి**

ములుగు రూరల్, డిసెంబర్ 18 : జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 30న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీపడేలా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టీ మాధవి అన్నారు. సోమవారం జడ్జి ములుగు బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు ఈ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజీ పడే క్రిమినల్, సివిల్ కేసులను పరిష్కరించేలా సహకరించాలన్నారు. కక్షిదారులకు ఎలాంటి న్యాయ సలహాలు, సూచనలు అవసరమున్నా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు సీహెచ్ వేణుగోపాలాచారి, జనరల్ సెక్రటరీ మేకల మహేందర్, న్యాయవాదులు వినయ్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, భిక్షపతి, రవీందర్, సునీల్‌కుమార్, ప్రసాద్, స్వామిదాస్, బెక్కం నవత, మేకల మానస, జీ రజిత, పీ రవికుమార్, విజయ్‌కుమార్, రాజేందర్, ప్రసాద్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

గోవిందరావుపేట, డిసెంబర్ 18 : త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని తహసీల్దార్ అల్లం రాజ్‌కుమార్ బీఎల్వోలకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు, ఓటరు జాబితా ప్రీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఇంట్లోని ఓటర్లంతా ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా చూడాలన్నారు. అలాగే కొత్తగా ఎవరైనా ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకుంటే తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీటీ మమత, ఆర్ఐ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌కుమార్



ములుగు టౌన్ : ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్



ఏటూరునాగారం : గిరిజన దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న పీవో అంకిత్

# ప్రజావాణి అర్జీలకు పరిష్కారం చూపాలి

■ అదనపు కలెక్టర్ వేణుగోపాల్

ములుగు టౌన్, డిసెంబర్ 18 : ప్రతి సోమవారం ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ డీ వేణుగోపాల్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీవో కే సత్యపాల్‌రెడ్డితో కలిసి ప్రజావాణి నిర్వహించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 9, పింఛన్ల మంజూరు కోసం 2, ఇతర శాఖలకు చెందినవి 9, మొత్తం 20 అర్జీలు రాగా కొన్నింటిని సత్వరమే పరిష్కరించారు. మిగతా వాటిని సంబంధిత అధికారులకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో అప్పయ్య, పశు సంవర్ధక శాఖ అధికారి విజయ్ భాస్కర్, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, జిల్లా పౌర సరఫరాల అధికారి అరవింద్ రెడ్డి, మేనేజర్ రాములు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఉచిత బస్సు ప్రయాణాన్ని సవరించాలి**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సవరించాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) నాయకులు సోమవారం కలెక్టరేట్ అధికారి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డులున్నవారికి మాత్రమే అవకాశం కల్పించాలన్నారు. ఉచిత ప్రయాణం వల్ల ఆటో కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని, వారికి రూ. 3 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, కరుణాకర్, సాగర్, మనోహర్, రాజశేఖర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

**ఐటీడీఏలో గిరిజన దర్బార్**

ఏటూరునాగారం : స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్‌ను నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి పీవో అంకిత్ వినతిపత్రాలు స్వీకరించారు. గోవిందరావుపేట మండలం ఇప్పలగడ్డకు చెందిన పూనెం దివ్య డిఫెన్స్ ఉద్యోగం చేయాలని నిర్ణయించుకున్నట్లు, ఐపీఎస్ కోచింగ్‌కు, ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం అందజేయాలని పీవోకు విన్నవించారు. మంగపేట మండలం వాడగూడెం, కత్తిగూడెం, రాజుపేట గ్రామాలకు చెందిన రవి, రాంబాబు, మల్లయ్య, కుర్సం వెంకటేశ్వర్లు, లక్ష్మీ నర్సయ్య, దుబ్బ కృష్ణ కుమారి, బీ మోహన్‌రావు, సత్యవతి, శిరీష తదితరులు ఇసుక క్వారీలు ఏర్పాటు చేసుకునేందుకు పెసా గ్రామ సభలు నిర్వహించాలని వేర్వేరుగా అర్జీలు సమర్పించారు. తాడ్వాయి మండలం పడిగాపూర్‌కు చెందిన మైత శ్రీను టీఆర్ఎఫ్ కింద ఆర్థిక సాయం చేయాలని, మండల కేంద్రానికి చెందిన గొర్ర బాలస్వామి ఏదైనా డ్రైవర్ పోస్టు ఇప్పించాలన్నారు. తాడ్వాయి మండలం కామారానికి చెందిన గొంది అరవింద్ ఆర్థిక సాయం చేయాలన్నారు. వాజేడు మండలం కిష్టాపురానికి చెందిన పూనెం సరస్వతి ఉద్యోగావకాశం కల్పించాలని కోరారు. మిషన్ భగీరథలో వాటర్ మ్యాన్‌గా నియమించాలని తాడ్వాయి మండలం కొడిశాలకు చెందిన జగన్ కోరారు. దర్బార్‌లో ఏపీవో వసంతరావు, డీడీ పోచం, ఎస్‌వో రాజ్‌కుమార్, పెసా జిల్లా కో ఆర్డినేటర్ ప్రభాకర్, ఏసీఎంవో లింగాల శ్రీరాములు పాల్గొన్నారు.

## రామప్పను సందర్శించిన అమెరికన్లు

వెంకటాపూర్, డిసెంబర్ 18 : మండలంలోని రామప్ప దేవాలయాన్ని సోమవారం అమెరికాకు చెందిన డాన్, విట్ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించగా అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను స్టేట్ టూరిజం గైడ్ కుమార్, స్థానిక టూరిస్ట్ గైడ్స్ ద్వారా తెలుసుకున్నారు. రామప్ప ఆర్కిటెక్చర్ గొప్పగా ఉందని, భారతదేశంలోని దేవాలయాలు, శిల్పకళ, సంప్రదాయాలు తమకు బాగా నచ్చాయన్నారు. నాటి సంస్కృతి, చరిత్రను శిల్పాల్లో అద్భుతంగా చూపించారన్నారు. ఆలయంలోని ప్రతి శిల్పాన్ని తమ కెమెరాలో బంధించారు. అనంతరం రామప్ప చెరువులో బోటింగ్ చేశారు.



ఆలయ చరిత్రను వివరిస్తున్న గైడ్

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ములుగు రూరల్, డిసెంబర్ 18 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందించాలని జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ పోరిక రవీందర్‌నాయక్ అన్నారు. సోమవారం ఆయన మల్లంపల్లిలోని సబ్ సెంటర్‌ను సందర్శించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి వైద్యం అందించాలన్నారు. అనంతరం ఆయన మహ్మద్‌గౌస్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న సేవలను పరిశీలించారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రవీందర్

## కనులపండువగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

వెంకటాపురం (నూగూరు) డిసెంబర్ 18 : మండల కేంద్రంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా వేదపండితులు, ఆలయ పురోహితులు సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం కనులపండువగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు దనపనేని వెంకటేశ్వర్లు, వేల్పూరి లక్ష్మీనారాయణ, కలకోట సంతోష్‌కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## దళిత బంధు యూనిట్లను మంజూరు చేయాలి

మంగపేట, డిసెంబర్ 18 : ములుగు నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో ఎంపిక చేసిన 1100 దళిత బంధు యూనిట్లను లబ్ధిదారులకు మంజూరు చేయాలని ఏజెన్సీ దళిత సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పరికి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ములుగు అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామస్థాయి నుంచి లబ్ధిదారులను ఎంపిక చేసిన అధికారులు గత నెలలో ఎన్నికల కోడ్ కారణంగా దళితబంధును నిలిపి వేశారని, తిరిగి పథకాన్ని అమలు చేయాలని వినతిపత్రంలో కోరారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామన్నారు. ఆయన వెంట ములుగు జిల్లా ఉపాధ్యక్షుడు కోయిన నర్సింహారావు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్